


సమైక్యతకు స్ఫూర్తి షేక్ షబ్బీర్ వల్లీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా సూర్యారావుపాలెంలో విచిత్ర వేషధారణలు, భారీ సెట్టింగ్‌లతో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్న వేషం ఆంజనేయస్వామి. దీనికి కారణం షేక్ షబ్బీర్‌వలీ ఈ వేషధారణ వేయడం. ముస్లిం యువకుడు అయినప్పటికీ, బీసీ కాలనీలో నివాసం ఉంటూ, అందరితో సోదర భావంతో మెలుగుతు, మతసామరస్యతకు చిహ్నంగా నిలిచాడని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



ఆంజేయస్వామి వేషధారణలో వల్లీ

గ్రామీణ రోడ్ల దుస్థితి మారేనా..?

- శిథిలమైన పంచాయతీరాజ్ రహదారులు
- వందల కిలోమీటర్లలో దెబ్బతిన్న వైనం
- మరమ్మతులకు మోక్షం ఎప్పుడో
- ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్ళే బీచ్ రోడ్డు, యు.కొత్తపల్లి నుంచి పిఠాపురం వెళ్ళే రోడ్డు, ఉప్పాడ నుంచి మూలపేట వెళ్లే రోడ్డు, నాగులాపల్లి రహదారి, పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్లే మార్గం ఇలా చెప్పుకుంటూ పోతే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. మోకాలు లోతు ఏర్పడిన గుంతల్లో ప్రయాణం చేయాలంటే బెంబెలెత్తిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో సుమారు 6 వేల కిలోమీటర్లు పొడవున రోడ్లు ఉన్నాయి. వీటిలో 1200 కిలోమీటర్లకు పైగా రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు మూడేళ్ళ క్రితమే అంచనా వేశారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన నుంచి నిధులు వస్తేనే రోడ్లు బాగుచేసే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం మరమ్మతులు కూడా నిధులు విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. వర్షాకాలంలో లోతు తెలియక గుంతల్లో పడి కాళ్ళు, చేతులు విరగొట్టుకున్న వారు ఎంతో మంది ఉన్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయి. చివరకు కొన్ని ప్రాంతాల్లో ప్రమాదాలకు గురై ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి.



పిఠాపురం నుంచి యు.కొత్తపల్లి వెళ్లే రహదారిలో ప్రజల ఇక్కట్లు



చెరువులను తలపిస్తున్న పిఠాపురం రహదారి

మరమ్మతులకు నోచుకోక

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులకు ప్రాధాన్యం ఇవ్వాలి. గత ఐదేళ్లుగా కొత్త వాటికి నిధుల మంజూరు విషయాన్ని పక్కన పెడితే కనీసం ఉన్నవాటికి ప్రభుత్వం మరమ్మతులకూ కేటాయించడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్ అండ్ బి రహదారుల సంఖ్య, విస్తీర్ణంతో పోలిస్తే పంచాయతీరాజ్ రోడ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌ను దృష్టిలో ఉంచుకుని వీటి నిర్మాణం, నిర్వహణకు నిధుల సమస్య నెలకొనడంతో గత ప్రభుత్వ హయాంలో ఎక్కువ రోడ్లను రహదారుల, భవనాలశాఖలోకి విలీనం చేశారు. వెంటనే విలీన ప్రక్రియ పూర్తి చేసి నిధులు మంజూరు చేయించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులను కొత్తగా నిర్మాణం చేపట్టారు. విడతల వారీగా మరికొన్నింటికి నిధులు మంజూరైనా టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేసరికి 2019లో సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో రోడ్ల నిర్మాణం నిలిచిపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఇంకా ప్రారంభం కాని కొత్త పనులను రద్దు చేయడంతో ఆయా గ్రామస్థులకు నేటికీ ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రయాణికుల అవస్థలు

పలు పట్టణ, మండల కేంద్రాల నుంచి వెళ్లే ప్రధాన రహదారులు, గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లు గుంతలు పడి అధ్వానంగా మారడంతో ప్రయాణికుల బెంబేలెత్తుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్న రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక అవస్థలు తప్పడం లేదు. కొంతమేర రోడ్డు కొట్టుకుపోవడం లేదా భారీ గుంతలుగా ఏర్పడి చిన్నపాటి వర్షం పడినా అందులోకి నీరు చేరుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

నిధుల విడుదల చేస్తే ప్రయోజనం

జిల్లాలో పంచాయతీ రాజ్ రహదారుల పరిస్థితి దారుణంగా మారింది. గత వైసిపి ప్రభుత్వం కనీసం మరమ్మతులకు కూడా నిధులను కేటాయించలేదు. గుంతలను పూడ్చేందుకు సైతం ప్రయత్నం చేయలేదు. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. అనేక మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్యలను వివరించినా పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్ల దుస్థితిపై స్పందనలో సైతం ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాధులే కరువయ్యారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల బాగు కోసం కృషి చేస్తుందనే నమ్మకంతో జనం ఉన్నారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా మరమ్మతులపై ఇంకా ఓ నిర్ణయానికి రాలేదు. గుంతలు పూడుస్తామని మాత్రం చంద్రబాబు గతంలో ప్రకటించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ రోడ్ల దుస్థితిపై ఫోకస్ పెట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



ఒబెరాయ్ ప్రతినిధులతో మంత్రి దుర్గేష్

పర్యాటక ప్రాంతంగా పిచ్చుకలంక

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి-ఆత్రేయపురం, రాజమహేంద్రవరం రూరల్

పర్యాటక ప్రాంతంగా ఆత్రేయపురంలోని పిచ్చుకలంకను అభివృద్ధి చేయనున్నామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. ఒబెరాయ్ గ్రూప్ ప్రతినిధులు ఆర్.శంకర్, నవీన్‌గోస్వామి, మాలూన్ తానేజ్‌లతో కూడిన బృందం సోమవారం పిచ్చుకలంకను సందర్శించింది. పర్యాటక రంగ అంశాలపై సమీక్షించింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందం, రాజమండ్రి రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి వారి వెంట ఉన్నారు. సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా ఒబెరాయ్ ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారన్నారు. పిచ్చుకలంకలో పర్యాటకంగా అభివృద్ధికి ఉన్న అంశాలను పరిశీలించారని తెలిపారు. రవాణా, భౌగోళిక స్వరూపం, ఇతర టూరిజం ప్రాంతాల వివరాలను తెలుసుకున్నారన్నారు. ఇప్పటికే గండికోట, తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాల్లో ఒబెరాయ్ సంస్థ రిసార్ట్స్ నిర్మించిందన్నారు. పిచ్చుకలంక పర్యాటక ప్రాంతం అభివృద్ధిపై ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి, బండారు సత్యానందం, కలెక్టర్ మహేష్‌కుమార్ బృందానికి వివరించారన్నారు. ఈ ప్రాంతంలో రిసార్ట్స్ నిర్మించి అభివద్ధి చేస్తే ఉభయ గోదావరి జిల్లాలోని దేవాలయాలు వచ్చే యాత్రికులకు అనుకూలంగా ఉంటుందన్నారు. కోనసీమ జిల్లాలో కేరళను తలపించే విధంగా ప్రకృతి అందాలు ఉన్నాయన్నారు. కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా పర్యాటకులను ఆకర్షించే విధంగా టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కెనాల్ బోట్ షికార్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ పిచ్చుకలంక ప్రాంతంలో ఉత్తరం వైపుగా ఉన్న 56 ఎకరాలు స్థలాన్ని పర్యాటకంగా అభివృద్ధికి ఎంపిక చేశామన్నారు. ఛాయాచిత్ర ప్రదర్శన, మ్యాపులు ద్వారా బృందానికి ఈ ప్రాంత భౌగోళిక స్థితిగతులు, వరద తదితర అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ పిచ్చుకలంక ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు ఒబెరాయ్ బృందాన్ని క్షేత్ర పరిశీలనకు తీసుకురావడం అభినందనీయమన్నారు. పర్యాటక హబ్‌గా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దేందుకు అవకాశాలు నిండుగా ఉన్నాయన్నారు. ఔషధ మొక్కల పెంపకానికి ఈ ప్రాంతం ఎంతో అనువైనదని ఉందన్నారు. అన్ని అవకాశాలను మేళవించి మంచి టూరిజం ప్యాకేజీని తీసుకురావాలని ఆయన గ్రూప్ సభ్యులకు విన్నవించారు.

ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ పర్యాటకంగా అభివృద్ధి జరిగితే స్థానిక యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. పిచ్చుకలంక సుందరమైన ప్రాంతమని తెలిపారు. రాజమహేం ద్రవరంలో హేవలాక్ బ్రిడ్జిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. కడియపులంక ప్రాంతం బోట్ షికారుకు అనువుగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, ఎంఎల్ఎ బండారు సత్యానందరావు లాకుల స్థితిగతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పి.వెంకటాచలం, డిఇఇ జిఎస్‌వివి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



షిర్డీసాయి స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

ఘనంగా శ్రీకృష్ణాష్టమి

ప్రజాశక్తి-కడియం, ఉండ్రాజవరం

కడియం శ్రీ భ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామి ఆలయం గోసాలలోని శ్రీకృష్ణుని మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గిరజాల బాబు, రామకృష్ణతులసి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ప్రత్యేక పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కడియం శ్రీ షిర్డీసాయి విద్యా నికేతన్, డ్యాఫ్నిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్కూల్ ఫౌండర్ తంబాబత్తుల పాలేశ్వరరావు సతీమణి నాగమణి శ్రీకృష్ణాష్టమి విశేషాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం, కాల్దరి గ్రామాల్లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. మండలంలోని కృష్ణుని దేవాలయాలు యాత్రికులతో కిక్కిరిసాయి. పలుచోట్ల ఊరేగింపులు జరిగాయి. చిన్నారుల కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు.

పేట్రేగిపోతున్న ఆక్రమణదారులు

రోడ్లు, డ్రెయిన్లపై అక్రమ కట్టడాలు

ప్రజాశక్తి- గోపాలపురం

గోపాలపురంలో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. ఆర్ అండ్ బి రోడ్లు, ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేస్తున్నారు. నాయకులు అండదండలు పుష్కలంగా ఉండడంతో జాగా కనిపిస్తే చాలా పాగా వేసేస్తున్నారు. గోపాలపురం చెక్‌పోస్టు సెంటర్ బస్టాప్ వద్ద 100 మీటర్లకు పైగా డ్రెయినేజీని ఆక్రమించేశారు. డ్రెయినేజీపైనే అక్రమంగా షెడ్లు నిర్మించి అద్దెలకు ఇస్తూ రూ.లక్షల్లో వ్యాపారాలు సాగిస్తున్నారు. గతంలో డ్రెయినేజీపై ఒక వ్యాపారి అక్రమంగా షెడ్డును ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు వెళ్లి ఫోటోలు దిగొస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలూ తీసుకోవట్లేదని స్థానికులు చెబుతున్నారు. సోమవారం అదే ప్రాంతంలో మరో వ్యాపారి రోడ్డు, డ్రెయినేజీని ఆక్రమించి శాశ్వత నిర్మాణ పనులను ప్రారంభించాడు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా పంచాయతీ, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. నాయకుల అండదండలు ఉండటంతో అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితులు కూడా ఉన్నాయి.

గోపాలపురం ఊరు ప్రారంభం నుంచి గ్రామ శివారు వరకు నేషనల్ హైవే రోడ్డు, ఆర్ అండ్ బి రోడ్లు, మెయిన్ రోడ్డు సెంటర్, బస్‌స్టాప్‌ల వద్ద ఆక్రమణలు అధికంగా ఉన్నాయి. బస్‌స్టాప్ స్థలాన్ని కూడా ఆక్రమించడంతో ప్రయాణికులు నిలబడేందుకు చోటు లేక రోడ్లపైనే పడిగాపులు కాస్తున్నారు. గోపాలపురం- తాళ్లపూడి రోడ్డులోనూ ఇదే పరిస్థితి. ఇప్పటికైనా ఆక్రమణలను తొలగించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రెయినేజీని ఆక్రమించి నిర్మించిన నిర్మాణం



ఆక్రమణలు పెరగడంతో రోడ్డుపైనే నిలుపుతున్న వాహనాలు

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక ఆనంద నగర్ మదర్‌థెరిసా విగ్రహం వద్ద టిడిపి నాయకులు మండల రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ వాసు ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల ఇబ్బందులను గుర్తించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన మండల రవికుమార్‌ను ఎంఎల్ఎ వాసు అభినందించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి 200 మంది పేదలకు మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ బాలస్ ఆర్థోపెడిక్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కెవి.బాలసుబ్రహ్మణ్యం, శ్రీలత హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అనుసూరి ప్రియాంక, స్మైల్ ఫస్ట్ దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ డివిఎస్.కృష్ణ, డాక్టర్ కంచర్ల హరీష్ తదితరులు వైద్య సేవలు అందించారు. అనంతరం వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.16,500 విరాళం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్‌కు ఆవరోడ్డు బాలాజీ పేటకు చెందిన చెందిన ఎఎస్.గణేశ్వరరావు రూ.16,500 విరాళం అందించారు. ఈ చెక్కును రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు అందించారు. తిలక్ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు కంటిపూడి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఈ చెక్కును ఎంఎల్ఎకు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వాసు మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటిపూడి శ్రీనివాస్, మస్తాన్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం మార్కండపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాన్ని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీకి రావాల్సిన నిధులను దారి మళ్లించారన్నారు. తమ హయాంలో ప్రతి పైసాను పంచాయతీలకే ఖర్చుపెడతామన్నారు. ఐక్యంగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోనిఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ 24 గంటలు పని చేసే విధంగా చర్యలు తీసుకుంటామని, పేషెంట్లకు మంచి వైద్యం అందించేలా చూస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకష్ణ జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, గ్రామ సర్పంచ్ కంద్రిక శివపోసి, మట్ట వీరస్వామి, టిడిపి నాయకులు సుంకర రమేష్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి చిరంజీవి, టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, కె.సతీష్ పాల్గొన్నారు.

మదర్ థెరిసాను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

మదర్ థెరిసాను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు అన్నారు. మదర్ థెరిసా యూత్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆనందనగర్‌లోని మదర్ విగ్రహం వద్ద జయంతిని నిర్వమించారు. దీనికి ఎంఎల్ఎ వాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాయకులు మొకమాటి సత్యనారాయణ, మండల రవి కుమార్, అగురు ధన్ రాజ్, మండల విశ్వేశ్వరరావు (నాయుడు), గిడుతూరి గోవింద్, యూత్ సర్కిల్ సభ్యులతో కలిసి కేక్ చేశారు. అనంతరం 500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 1500 మందికి అన్నదానంచేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా యూత్ అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ గౌరవ సలహాదారుడు చిందాడ అప్పారావు, ప్రెసిడెంట్ యళ్లా విజయకుమార్, వైస్ ప్రెసిడెంట్ మన్నె స్వామి, కార్యదర్శి ఎస్‌కె ఈసుభాషా, జాయింట్ సెక్రటరీ ఏడెళ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు

రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామంలో స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసి కుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని నిర్వహించారు. పోసికుమార్ మాట్లాడుతూ మదర్ ఆశయాలకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేమగిరి జనసేన పార్టీ నాయకులు అల్లంపల్లి ప్రసాద్ ఏర్పాటుచేసిన చీరలును మహిళలకు అందించారు. దాతలు జి. జైకుమార్ జి.జయప్రద, జి. నాగార్జున, జి.శ్రావ్య ఏర్పాటు చేసిన భోజనాలను వృద్ధులకు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కెవిఆర్.సాగర్, బి.దుర్గ, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

నిడదవోలు : ప్రార్థించే పెదవుల కన్నా చేయూతనిచ్చే చేతుల మిన్న అని ప్రపంచానికి ఆచరణలో వాస్తవ పరిస్థితిని చెప్పిన మదర్ థెరిసా జీవితం అందరికీ ఆదర్శనీయమని కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జువ్వల రాంబాబు అన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ కెవిపిఎస్, ఎపిఎస్ నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ నర్సెస్ యూనియన్ ఆధ్వర్యంలో మదర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత మదర్ విగ్రహానికి రాష్ట్ర నాయకులు డి.దయామణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాంబాబు మాట్లాడారు. మదర్ సేవలను వివంచారు. ఈ కార్యక్రమంలో దయామణి, రాణి, జ్యోతి, భాను, ఎం.అశోక్, త్రిమూర్తులు, పి.నాగరాజు, జి.అశోక్, సత్తిబాబు, యు.మోషే మహిళలు పాల్గొన్నారు


చాగల్లు : మదర్ థెరిసా సేవా సమితి అధ్యక్షులు పోలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలోబ దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమంలు నిర్వహించారు. చాగల్లు భవితా కేంద్రంలో 60 మంది వికలాంగులకు యాతం శ్రీను వరలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో సమకూర్చిన దుప్పట్లు, 25 మంది వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. పంగిడికి చెందిన వీరమల్ల గోపీకృష్ణ, ఆత్కూరి ప్రసాద్ ఆధ్వర్యంలో డ్రైఫ్రూట్స్‌ను అందించారు. పూలదాస్ అరవింద్ వీరబాబు శివ భోజన వసతులను కలిపంచారు. దుబాయి లో ఉంటున్న కోడి రాజా రవి కిరాణ్ ఇద్దరు దివ్యాంగులకు వైద్యసేవలకు ఆర్థిక సహకారం అందించార. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆళ్ల హరిబాబు, కరుటూరి సతీష్, సిహెచ్.మల్లేశ్వరరావు, నాదెళ్ల నాని, కోడి నాగేశ్వరరావు కోడి శ్రీనివాసరావు సేవా సమితి సభ్యులు, భవితా కేంద్రం విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు .

కడియం : మండలం పొట్టిలంక గ్రామంలో లూథరన్ ఆవరణలో మదర్ థెరిస్సా సేవా సంఘ అధ్యక్షులు నక్కా. వెంకట రత్న రాజు, కార్యదర్శి అర్థల కుమార్‌బాబు ఆధ్వర్యంలో మదర్ జయంతిని నిర్వహించారు. థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. రత్న రాజు మాట్లాడుతూ మదర్ జీవితం అంతా సేవకే అంకితం చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆమె సేవానిరతిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పల్లి కిరణ్, యాళ్ల సురేష్, రెముళ్ల అరుణ్‌కుమార్, నేరిమెల్లి ప్రవీణ్‌కుమార్, గుర్రం సంజీవ్, మేడిద ఎజ్రా శేఖర్, నక్కా.అంబేద్కర్ , నేతల శ్రీ దేవీ, నక్కా షాలిని, నక్కా మేఘన వై.దీపిక పాల్గొన్నారు.

కడియం : దుళ్ల మార్కెట్ సెంటర్‌లో మదర్ థెరిసా సేవా సమితి ఆధ్వర్యంలో థెరీసా జయంతిని ఘనంగా నిర్వహించారు. పలువురు థెరీసా విగ్రహానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి పంచారు. ఇంటింటా స్వీట్లు అందించారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గుర్రపు కొండయ్యమాస్టారు, ఎంపిటిసి సభ్యులు కట్టుంగ నాగరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు తాతపూడి బాబి, టేకి శ్రీనివాస్ పాలొన్నారు.



మహిళలకు చీరలను అందజేస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్




సాయం అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

కిడ్నీ బాధితునికి మానవత సాయం

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలో ఎర్నగూడెం గ్రామానికి చెందిన బి.రవీంద్ర కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయనకు మానవత ఆధ్వర్యంలో రూ.వేలు, జనసేన రామన్నపాలెం శాఖ రూ.1000 అందించారు. మానవత జిల్లా కమిటీ సభ్యులు బల్ల సూర్యచక్రం మాట్లాడారు. ఎంఎల్ఎ సహకారంతో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు దాతల ద్వారా విరాళాలు సేకరించి ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కేశిరాజు రాజకుమార్, మానవత మండల చైర్మన్ బండి సూర్య ప్రకాశరావు, వైస్ చైర్మన్ పప్పు వెంకటరామారావు, కార్యదర్శి ఉప్పల అయ్యప్ప, కోశాధికారి తీగల లక్ష్మీనారాయణ, డైరెక్టర్ యలమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు



నిందితుల వివరాలను తెలియచేయండి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటారు బైక్(బుల్లెట్) చోరీకి పాల్పడిన నిందుతులను పోలీసులు గుర్తించారు. ఈ నెల 24న జరిగిన మోటారు బైక్(బుల్లెట్) చోరీ ఘటనలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో భాగంగా సిసి పుటేజ్‌లో ఉన్న వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ జ్వాలాసాగర్ తెలిపారు ఇరువురు నిందితుల పేర్లు ఎవరికైనా తెలిస్తే సెల్ నెంబర్ 9440796564కు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని మర్లపాలెం పంచాయతీ పరిధిలోని కొబ్బరి తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సోమవారం ఎస్ఐ డి.జ్వాలాసాగర్, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2050 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఎస్ఐ మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

స్థానిక బైపాస్ కేశవ స్వామి కాలనీ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఎస్ఐ మృతి చెందారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కాకినాడ కొండయ్యపాలెం టిటి.ఎస్ఆర్ నగర్‌కు చెందిన రిటైర్డ్ ఎస్ఐ మోర్త అప్పారావు(64) సోమవారం ద్విచక్ర వాహనంపై యానాం వైపు వెళ్తూ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో ఆయన తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని నీలాంద్రిరావుపేటలో ఈ నెల 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలను సోమవారం ఎస్ఐ శివనాగు వెల్లడించారు. నీలాద్రిరావు పేట గ్రామానికి చెందిన సానిబోయిన వీరబాబు, నక్కా శ్రీను ఈ నెల 23వ తేదీన జగ్గంపేట నుంచి నీలాంద్రిరావుపేటకు ద్విచక్రవాహనంపై వెళుతుండగా అదుపు తప్పి పడిపోయారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారు విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని పి.సూరంపాలెం గ్రామ పరిసరాల్లో నాటుసారా తయారీ కేంద్రంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వినియోగించే 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ యువి.శివనాగబాబు తెలిపారు. నాటు సారా తయారీ చేస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

ఫిర్యాదుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - రౌతులపూడి

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తిపై మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై డిఎస్‌పి లతాకుమారి సోమవారం విచారణ చేశారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఒక మైనర్‌బాలికను అదే గ్రామానికి చెందిన చందక కాశి అనే వ్యక్తి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై డిఎస్‌పి లతాకుమారి గ్రామానికి చేరుకుని విచారించారు.

మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లవిల్లి పంచాయతీ వాడపర్రు ఇందిరానగర్‌కు చెందిన గుర్రాల అక్కిరాజు(30) ఆదివారం సాయంత్రం ఇంటికి సమీపంలోని రంగరాజుకోడు మురుగు కాలువ గట్టుకు పుల్లలు ఏరుకునే నిమిత్తం వెళ్ళాడు. ప్రమాదవశాత్తు కాలు జారి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో గాలించగా మురుగు కాలువలో మృతదేహం కనిపించింది. అక్కిరాజుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు మృతుని సోదరుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి పి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఎంఎల్ఎ చొరవతో వ్యక్తికి ఉచిత వైద్యం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు చొరవతో ఉచితంగా వైద్య సేవలు అందాయి. మండలంలోని అనాతవరం గ్రామానికి చెందిన చవ్వాకుల కుమారస్వామి ఇటీవల మహిపాల చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అమలాపురం కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కుమార స్వామికి ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించేందుకు అవసరమైన రేషన్ కార్డుగాని, ఆరోగ్యశ్రీ కార్డుగాని లేకపోవటంతో ఉచిత వైద్యం పొందడానికి అవకాశం లేకపోయింది. దీంతో గ్రామ టిడిపి అధ్యక్షుడు శివబాబు ఆ వ్యక్తి యొక్క పరిస్థితిని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంఎల్ఎ చొరవ తీసుకుని సిఎం క్యాంపు కార్యాలయం నుంచి అనుమతి లెటర్ రప్పించారు దీంతో అతనికి ఉచిత వైద్య సేవలు అందించారు.

ప్రమాదాలకు నిలయంగా రోడ్లు

ప్రజాశక్తి - ఆలమూరు

నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉండే ఈ రహదారులపై నిరంతర అంతరాయంతో ప్రయాణం చేయాలంటేనే బెంబేలెత్తి పోతున్నారు. ఆలమూరు మండల పరిధిలో సుమారు 50 కిలోమీటర్ల మేర వివిధ రహదారులు ఉన్నాయి. ఈ మార్గాల్లో అడుగడుగునా చింద్రంగా మారి గోతులతో ప్రయాణికుల పాలిట నరకప్రాయంగా తయారయ్యాయి. ఈ క్రమంలో పలువురి ప్రయాణికులకు పలు చోట్ల వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా ఆ శాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

మండలంలో జొన్నాడ నుంచి గుమ్మిలేరు వరకు 9 కిలోమీటర్ల మేర, మడికి శివారు మల్లవానితోట నుండి సంధిపూడి వరకు 21 కిలోమీటర్ల మేరకు ఆర్ అండ్ బి రోడ్లు ఉన్నాయి. ఇవి నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. ప్రస్తుతం ఈ రోడ్లు భారీ గోతులతో ప్రయాణించడానికి వీల్లేని పరిస్థితికి చేరుకున్నాయి. ఇందులో మరీ ముఖ్యమైన 216 జాతీయ రహదారి జొన్నాడ సెంటర్ నుండి మండపేట మీదుగా కాకినాడ వెళ్లే ప్రధాన రహదారిపై మరింత రద్దీగా వాహన రాకపోకలు నిత్యం సాగుతూ ఉంటాయి. అలాంటి ఈ రహదారిపై అధికారుల ఆలనా పాలనా లేక పెద్ద పెద్ద గోతులతో బురద మయంగా తయారైంది. దీంతో ఈ రహదారిపై వెళ్లే ప్రయాణికుల వాహనాలు అదుపు తప్పి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ కోవలోనే జొన్నాడ 'ఎస్ టర్నింగ్', 'ఎల్ టర్నింగ్'ల వద్ద, మండల కేంద్రంలో ఎంపిపి పాఠశాల టర్నింగ్ వద్ద, మురళీ కృష్ణ, సత్యలక్ష్మీ రైస్ మిల్లుల సమీప ప్రదేశాలలో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. నర్సిపూడి హైస్కూల్ వద్ద, పెనికేరు గ్రామ టర్నింగ్‌లోనూ, కొత్తూరు సెంటర్ నుంచి చింతలూరు, పెదపళ్ల, సంధిపూడి వెళ్లే రహదారుల్లోనూ దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. చొప్పెల్ల, నందిగుంట నుంచి మూలస్థానం వరకు విస్తరించిన ఐదు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఇందులో పలువురు ప్రాణాలు కోల్పోగా పలువురు అంగవైకల్యంతో మంచానికే పరిమితం అయ్యారు. వెంటనే నూతన ప్రభుత్వం స్పందించి రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతుల పేర రూ.2.12 కోట్లు వథా

2019 జనవరిలో జొన్నాడ, గుమ్మిలేరు రహదారికి రూ.1.72 కోట్లతోను, జొన్నాడ ఎస్ టర్నింగ్, ఎల్ టర్నింగ్‌ల ఆధునీకరణకు రూ.40 లక్షలతో నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ ఇంతవరకు గుత్తేదారులకు ఆ నిధులు విడుదల కాకపోవడంతో వీటికి మరమ్మతులు విస్మరించారు. ఈ కారణంగానే రహదారి సమస్య మరీ దుర్భరంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, కనీసం తాత్కాలిక మరమ్మతులైన చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



మురుగునీటి మడుగులతో చింతలూరు ఆర్ అండ్ బి రహదారి



జొన్నాడ టర్నింగ్ వద్ద రోడ్డు దుస్థితి, ట్రాఫిక్ జామ్

రహదారుల నిర్మాణానికి చర్యలు

ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఇంతకాలం నిధులు విడుదల విషయంలో జాప్యం ఏర్పడింది. తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు కోసం ఎస్టిమేట్లు పంపించాం. టెండర్ల కోసం పిలుస్తున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లాం.

- సూర్యనారాయణ, ఆర్ అండ్ బి డిఇ

అనధికార ఆహార విక్రయాలు

చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న రైల్వే అధికారులు

ప్రజాశక్తి - సామర్లకోట



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో అనధికారంగా ఆహార విక్రయాలు కొనసాగుతున్నాయి. నిత్యం సామర్లకోట రైల్వే స్టేషన్ ద్వారా వేలాదిమంది ప్రయాణికులు వివిధ రైళ్లలో తమ తమ గమ్యాలకు ప్రయాణాలు సాగిస్తుంటారు. సామర్లకోట రైల్వేస్టేషన్‌లో గుర్తింపు లేని వ్యక్తులు అనాధికారికంగా సాగిస్తున్న ఆహార అమ్మకాలతో భద్రత కొరవడిందన్న ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. రైల్వే శాఖ గుర్తింపు పొందిన ఆదీకృత ఫుడ్ స్టాల్స్, ఏజెంట్లు మాత్రమే ఆహార అమ్మకాలు సాగించాల్సివుంది.కానీ అందుకు విరుద్ధంగా ఇక్కడ ఐఆర్‌టిసి పేరుతో పేరుతో కనీస గుర్తింపు కార్డు కూడా లేని అనేకమంది వ్యక్తులు ఆహార పదార్థాల అమ్మకాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక రైల్వేస్టేషన్లోని ఒక ప్రముఖ ఏజెంట్ వద్ద కేవలం 7 నుంచి 8 మంది గుర్తింపు కార్డులు కలిగిన వ్యక్తులు మాత్రమే అమ్మకాలు సాగించాల్సి ఉండగా, సుమారు 30 మంది వరకూ ఎటువంటి గుర్తింపు కార్డులు లేకుండానే అమ్మకాలు సాగిస్తున్నారు. రైల్వే అధికారులు, రైల్వే పోలీసులు పట్టి పట్టనట్లు వ్యవహరించడంతో వీరి అమ్మకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలని, ప్రయాణికులకు నాణ్యమైన, ఆరోగ్య కరమైన ఆహార పదార్థాలను అనుమతులు ఉన్న ఏజెన్సీ ద్వారామాత్రమే విక్రాయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



నూతన కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న నాయకులు

అసోసియేషన్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - రాజానగరం

ఎపిఎస్ఇబి ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని డివిజన్ నూతన కార్యదర్శి కందికట్ల సురేష్ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ సర్వసభ్య సమావేశం రాజానగరం విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో సోమవారం డివిజన్ అధ్యక్షులు ఎన్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ నూతన కార్యదర్శిగా కందికట్ల సురేష్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుస్తూ, అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం పోరాడతానన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఇపిడిసిఎల్ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ జిజె.సుధాకర్, జిల్లా అడ్వయిజైర్ డి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు వి.కాంతారావు, జిల్లా కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, డివిజన్ గౌరవ అధ్యక్షులు తుమ్మల తాతారావు, డివిజన్ సభ్యులు పాల్గొన్నారు.

మాలమహానాడు మండల కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం మండలం మాల మహానాడు కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగింది. 14 గ్రామపంచాయతీల పరిధిలో దళితులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మాల మహానాడు మండల అధ్యక్షులుగా అంబటి అబ్రహాం, ఉపాధ్యక్షులుగా ఐవిఆర్‌వి.ప్రసాద్‌కుమార్ (డాక్టర్ శ్రీను) ప్రధాన కార్యదర్శిగా కొయ్య సాల్మాన్‌రాజు, కోశాధికారిగా మెప్పెల్లి జయరాజుతోపాటు 30 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు అబ్రహాం మాట్లాడుతూ ఎబిసిడి వర్గీకరణపై హైకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకించారు. వర్గీకరణ రద్దు చేసే వరకు పోరాడుతామన్నారు.

భార్యను గాయపర్చిన భర్తపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భార్యతో గొడవపడి ఆమెను గాయపరిచిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన గూడూరు వేదవతికి 2009లో భీమవరానికి చెందిన గూడూరు పవన్‌తో వివాహం అయ్యింది. కుటుంబ కలహాలతో ఇద్దరూ వేరువేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వేదవతి భర్త పవన్ వాడపల్లిలో ఆమె ఇంటి వద్దకు వచ్చి ఆమెతో గొడవపడి ఆమెను గాయపరిచాడు. ఆమె కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



సామర్లకోటలో జరిగిన అన్నదానం కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం పట్టణ, మండల పరిధిలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పాత పెద్దాపురం కృష్ణుని గుడి వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక ఆర్‌డిఒ జె.సీతారామారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. **సామర్లకోట** స్థానిక విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణాలయంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీశ్ మోహన్, యార్లగడ్డ రవి చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. **కాజులూరు** మండల పరిధిలో అన్ని గ్రామాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమిని ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు, పలుచోట్లా పేదలకు వస్త్ర దానాలు చేపట్టారు. **తాళ్లరేవు** :మండలంలోని పాఠశాలలు, ఆలయాల వద్ద కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. సుంకరపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో చిన్నారులు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. చొల్లంగిపేటలో చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. **కపిలేశ్వరపురం** మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. **రామచంద్రపురం** పట్టణంలోని మోడరన్ హైస్కూల్లో అకడమిక్ డైరెక్టర్ ఆర్. ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి. గుణ్ణం వీర్రాజు బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. విద్యాసంస్థల అధినేత జివి.రావు మాట్లాడారు. హెచ్‌ఎం ఎం.చిట్టిబాబు పాల్గొన్నారు. **ఆలమూరు** మండలంలోని చెముడులంక నేతాజీ స్కూల్లో కరస్పాండెంట్ తుమ్మ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌ఛార్జి దూలం స్వామి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, టీచర్లు రాజశేఖర్, దుర్గ పాల్గొన్నారు.



రామచంద్రపురంలో కృష్ణాష్టమి వేడుకలు

థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం : కందుల

ప్రజాశక్తి - నిడదవోలు

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన మదర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిస్వార్ధ సేవకు మారుపేరు మదర్ థెరీసా అన్నారు. విశ్వమాతగా పేరు పొందిన మదర్ థెరీసా విగ్రహావిష్కరణ ద్వారా యువతకు, భవిష్యత్ తరాలకు ఆమె యొక్క గొప్పతనాన్ని తెలియ చేసేందుకు అవకాశం ఉందన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మదర్ తెరిసా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల మంత్రి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఒక మధురానుభూతిని కల్పించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, వాకర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు



థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కందుల

యానాం వార్తలు



బొక్కుసార చేపను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - యానాం

ఎంతో చరిత్ర కల్గి నేడు అంతరించుపోతున్న బొక్కుసార చేపను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి.గొంతయ్య సూచించారు. సోమవారం స్థానిక ఇందిరాగాంధీ మార్కెట్ కాంప్లెక్స్‌లో ఎపి ప్రభుత్వ అటవీశాఖ కోరింగ విభాగం ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొక్కుసార చేపను రక్షించుకునేవిధంగా మత్స్యకారులు కృషి చేయాలన్నారు. సముద్రంలో వేట సమయంలో బొక్కుసార కనిపిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ చంపకూడదన్నారు. ఈ చేప వల్ల సముద్రంలో పొల్యూషన్ తగ్గుతుందని, ఎటువంటి హాని చేయదన్నారు. బొక్కుసార చేప పూర్తిగా అంతరించిపోకుండా అందరూ కలిసి కాపాడుకోవాలన్నారు. అటవీశాఖ కోరంగ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు మాట్లాడుతూ వేటకు వెళ్లే మత్స్యకారులు అందరూ బొక్కుసార చేప గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.ధనంజయ, గోపి నాగేంద్రకుమార్ పాల్గొన్నారు. తొలత మార్కెట్ కాంప్లెక్స్‌లోని మత్స్యకారులకు బొక్కుసార చేప గురించి వివరించి వాటి రక్షణపై అవగాహన కల్పించారు. అలాగే సావిత్రినగర్‌లోనూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



పెట్రోల్ బంక్ వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం

ముక్తేశ్వరంలో పారిశుధ్యలేమి

ప్రజాశక్తి-అయినవిల్లి

మండల కేంద్రమైన ముక్తేశ్వరం మెయిన్ రోడ్డు పెట్రోల్ బంకు వద్ద గ్రామం మధ్యలో చెత్తా చెదారంతో పారిశుధ్యం లోపిస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారాలతో పేరుకుపోయి అధ్వానంగా ఉండటంతో గ్రామ ప్రజలు అటుగా వెళ్లే వాహనదారులు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు తోడు చెత్తాచెదారంతో దోమలు, ఈగలు బాగా పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.